క్లుప్తంగా

ఎర్రగట్టుతండా వాసికి డాక్టరేట్



ధారావత్ నాగరాజు

మేళ్లచెరువు : మండల పరిధిలోని ఎర్రగట్టు తండా గ్రామానికి చెందిన ధారావత్ నాగరాజు డాక్టరేట్ పొందారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెస్మెంట్ ఆఫ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ విత్ ఇంటిగ్రేషన్ ఆఫ్ డిస్ట్రిబ్యూటెడ్ ఎనర్జీ రిసోర్సెస్ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్ అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. పంజాబ్‌లోని ప్రతిష్టాత్మకమైన లవ్లీ ప్రొఫెషనల్ విశ్వ విద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు తెలిపారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. డాక్టరేట్ రావడంతో గ్రామస్తులు ఆయనను అభినందించారు.

'షాదీ ముబారక్' కోసం ఏడాదిగా ఎదురుచూపు

నడిగూడెం : మండలంలో షాదీ ముబారక్ పథకానికి దరఖాస్తు చేసుకున్న 30 మంది మైనార్టీ వర్గానికి చెందిన లబ్ధిదారులు ఏడాది కాలంగా ఆ పథకం చెక్కుల కోసం ఎదురు చూస్తున్నారు. చెక్కుల మంజూరులో జాప్యంపై మండల అధికారులను అడిగితే బడ్జెట్ లేదని చెబుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఎన్నో ఆశలతో ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నామని, ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించి తమ కుటుంబాలను ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి



రక్తదానం చేసిన కిరణ్‌ను అభినందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని జనచైతన్య సమితి వ్యవస్థాపకుడు వంశీ కోరారు. హుజూర్‌నగర్‌లో ఓ మహిళకు బి పాజిటివ్ రక్తం అత్యవసరం కావడంతో ట్రస్ట్ వారిని సంప్రదించారు. దీంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం దాత గొట్టె కిరణ్‌తో మాట్లాడి రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడంతో ఆపదలో ఉన్న వారి ప్రాణం నిలిపిన వారవుతారని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పి.వంశీ, పి.సాయి, పి.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తుల్జాభవాని ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న వైస్ ఎంపీపీ ప్రమీలావెంకటరమణారెడ్డి, తదితరులు

గరిడేపల్లి : మండలంలోని శీత్లాతండా గ్రామంలో బుధవారం తుల్జాభవాని ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుల్జాభవానికి వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీలావెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరిని ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేడు దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం

నడిగూడెం : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశాన్ని గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

జనార్దనాచారి సేవలు అభినందనీయం



జనార్దనాచారిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సోమయ్య, తదితరులు

నడిగూడెం : జనార్దనాచారి సేవలు అభినందనీయమని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మన్నెం సోమయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన జనార్దనాచారిని బుధవారం కళాశాలలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు వస్తుందన్నారు. అధ్యాపకులు పిచ్చిరెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

నర్సరీలతో కూలీలకు ఉపాధి

- 9వ విడత హరితహారానికి 32 నర్సరీలు ఏర్పాటు
- ఒక్కోదాంట్లో ప్రతిరోజు 5- 10 మంది కూలీలకు పని
- మొక్కలు నాటే సమయంలోనూ ఉపాధి హామీ కూలీలకు పనులు



గడ్డిపల్లి నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు



గరిడేపల్లిలోని నర్సరీలో పనులు చేయిస్తున్న అధికారి

గరిడేపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హరితహారం పథకంతో పల్లెల్లో పచ్చదనం పెరగడంతో పాటు కూలీలకు ఉపాధి లభిస్తోంది. హరితహారం మొక్కల పెంపకానికి ప్రతి గ్రామ పంచాయతీకి ఒకటి, రెండు చొప్పున నర్సరీలు ఏర్పాటు చేశారు. ఈ నర్సరీల ద్వారా కూలీలకు ఉపాధి దొరుకుతోంది. అధికారులు ఒక్కో నర్సరీలో రోజుకు కనీసం 5 నుంచి 10 మంది కూలీలను పనులు కల్పిస్తున్నారు. ప్రారంభంలో ప్లాస్టిక్ బ్యాగుల్లో మట్టి నింపడం, మట్టికి ఎరువులు కలిపి మొక్కలను నాటేందుకు బెడ్లను సిద్ధం చేయడం, విత్తనాలు నాటడం, నీళ్లు పెట్టడం వంటి పనులతో పాటు ప్రస్తుతం నర్సరీ నిర్వహణ, మొక్కలకు నీళ్లు అందించడం వంటి పనుల కోసం ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులను కల్పిస్తున్నారు. హరితహారం కార్యక్రమం ప్రారంభం అయిన తర్వాత మొక్కలు నాటే సమయంలోనూ ఉపాధి హామీ కూలీలకు పనులు దొరుకుతాయి.

2.40 లక్షల మొక్కలు..

మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉండగా 9వ విడత హరితహారం కార్యక్రమానికి గాను 32 నర్సరీలను ఏర్పాటు చేశారు. వీటిల్లో దాదాపు రెండు లక్షల 40 వేల మొక్కలు పెంచుతున్నారు. ప్రతి గ్రామ పంచాయతీల్లో నాటేందుకు అవసరమైన మొక్కలను పెంచుతున్నారు. ఆయా నర్సరీల్లో ఎరువులు, ఎర్రమట్టితో ప్రత్యేకంగా బెడ్లను తయారు చేసి మొక్కలు పెంచుతున్నారు. ప్రధానంగా ప్రజలకు పంపిణీ చేసేందుకు ఇళ్లల్లో నాటేందుకు అనువైన జామ, సీతాఫలం, దానిమ్మ, చింత, నిమ్మ, కరివేపాకు, గోరింటాకు వంటి మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించి పెంచుతున్నారు. తరువాత ప్రాధాన్యత క్రమంలో ఎవెన్యూ ప్లాంటేషన్, గ్రామ అవసరాలకు అనుగుణంగా పలు నర్సరీలలో గులాబీ, గానుగ, విరజాజి, మందారం, జామ, నిమ్మ వంటి మొక్కలను హరితహారానికి సిద్ధం చేస్తున్నారు.

పనులు కల్పిస్తున్నాం



హరితహారం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీల ద్వారా కూలీలకు పనులు కల్పిస్తున్నాం. ప్రతిరోజు మొక్కలకు నీరు పోయడం, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్క నాటడం వంటి పనులను ఉపాధి హామీ కూలీలతో చేయిస్తున్నాం.

– కె.వనజ, ఎంపీడీఓ, గరిడేపల్లి

ట్రిపుల్‌ఆర్ విజయవంతానికి సహకరించాలి



పాత దుస్తులు సేకరిస్తున్న కమిషనర్, కౌన్సిలర్

హుజూర్‌నగర్ : ట్రిపుల్ ఆర్ (రెడ్యూస్, రీయూస్, రీసైకిల్) కార్యక్రమ విజయవంతానికి ప్రజలు సహకరించాలని కౌన్సిలర్ వి.నాగేశ్వరరావు, కమిషనర్ వెంకటేశ్వర్లు కోరారు. హుజూర్‌నగర్‌లోని 4వ వార్డులో (రెడ్యూస్, రీయూస్, రీసైకిల్) కార్యక్రమాన్ని బుధవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు తమ ఇళ్లలో ఉపయోగపడని ప్లాస్టిక్ వస్తువులు, పాత బట్టలు, ఆట బొమ్మలు ఏమైనా ఉంటే మున్సిపల్ సిబ్బందికి ఇచ్చినట్లయితే వాటిని అవసరమైన వారికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించి ట్రిపుల్‌ఆర్ కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని వారు కోరారు. అనంతరం ఆ వార్డులో పత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టి రోడ్డుకి ఇరువైపులా ఉన్న పిచ్చిచెట్లను తొలగించి డ్రెయినేజీలో పూడిక తీయించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, పర్యావరణ ఏఈ రాజశేఖర్, పద్మ, వెంకటేశ్వర్లు, మెప్మా ఆర్‌పీలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు గౌరవ వేతనం పెంపుపై హర్షం

నేరేడుచర్ల : రంగారెడ్డి జిల్లా గోపనపల్లిలోని బ్రహ్మణ సంక్షేమ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ దూప దీప నైవేద్య అర్చకులకు గౌరవ వేతనం పెంచుతున్నట్లు ప్రకటించడం పట్ల తెలంగాణ దూప దీప నైవేద్య అర్చకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నంబొట్ల ఫణికుమారశర్మ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అర్చకులకు ఇప్పటివరకు రూ.6 వేలు వేతనం ఇస్తున్నారని, ఇక నుంచి రూ. 10 వేల వేతనం ఇవ్వనున్నట్లు ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా తెలంగాణ బ్రహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా రూ. 2500 ఇచ్చే పింఛన్లను రూ.5 వేలకు పెంచడం, అర్చకులకు పింఛన్ వయసు పరిమితిని 75 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు తగ్గిస్తూ వారికి పింఛన్లు అందించనున్నట్లు తెలిపారన్నారు. అలాగే అదనంగా 2690 దేవాలయాల అర్చకులకు వేతనాలు ఇవ్వనున్నట్లు ప్రకటించినట్లు తెలిపారు. వేతనాలు పెంచడాన్ని హర్షిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కేసీఆర్ పేరుతో అన్ని దేవాలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించాలని అర్చకులను కోరారు.

రోడ్డు తవ్వారు.. నిర్మాణం మరిచారు



కంకరమయంగా తెల్లబెల్లి రహదారి

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరం నుంచి మునగాల మండలంలోని ఆకుపాముల వరకు చేపట్టిన బీటీ రోడ్డు పునర్నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఈ రోడ్డు రత్నవరం నుంచి తెల్లబెల్లి మీదుగా మునగాల మండలంలోని కోదండరామాపురం, ఆకుపాముల వరకు నిర్మిస్తున్నారు. ఈ రహదారి నిర్మాణానికి రోడ్లు, భవనాల శాఖ నుంచి దాదాపు కోటి రూపాయల మంజూరయ్యాయి. అయితే రోడ్డును తవ్వి నెల రోజులైనా పనులు మాత్రం ప్రారంభించలేదు. దీంతో నిత్యం ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. లోతైన గుంతలు, కంకరమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణించలేక కోదాడకు వెళ్లాలంటే రత్నవరం వాయిలసింగారం మీదుగా వెళ్తున్నామని ప్రజలు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రహదారి పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

గ్రంథాలయం అభివృద్ధికి సహకరిస్తా



గ్రంథాలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సైదయ్య, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు

చిలుకూరు : ఎంతో ఘన చరిత్ర కలిగిన చిలుకూరు బాపూజీ శాఖా గ్రంథాలయం అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని కోదాడ ఎస్‌వీ కళాశాల చైర్మన్, టీడీపీ రాష్ట్ర నాయకుడు ముత్తినేని సైదయ్య హామీ ఇచ్చారు. చిలుకూరులో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. గ్రంథాలయంలోని గదుల్లో టైల్స్ ఏర్పాటుకు కావాల్సిన నగదును ఇస్తానని ప్రకటించారు. రాజకీయాలకు అతీతంగా గ్రంథాలయం నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని గ్రంథాలయం పాలకవర్గ సభ్యులు కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్, కార్యదర్శి అంబాల వెంకటి, పిల్లుట్ల కృష్ణయ్య, సర్పంచ్ కొడారు బాబు, గ్రామ పెద్దలు, గ్రంథాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని రద్దు చేసేందుకు కుట్ర



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ముల్కలపల్లి రాములు

కోదాడరూరల్ : ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీలకు వెంటనే డబ్బులు అందకపోవడానికి అధికారుల వైఫల్యమే కారణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని రెడ్లకుంటలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద ఆయన కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు పని చేసిన వెంటనే వేతనాలు అందే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, ఆ ఆలోచనను కేంద్రం విరమించుకోవాలన్నారు. కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించకపోతే ఎంపీడీఓ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వెలిది పద్మావతి, రెడపంగు హుస్సేన్, మల్లెల పిచ్చయ్య, రమారమణి, పద్మ, లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ఆత్మకూర్ (ఎస్) : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కందగట్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎల్లబోయిన సత్తయ్య తన ఆవును మేత కోసం వదిలిపెట్టారు. మేత కోసం వెళ్లిన ఆవు గ్రామ శివారులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ రూ.50 వేల వరకు ఉంటుందని తెలిపారు.

ధాన్యం ఎగుమతిలో జాప్యం



కొమ్మాల పీఏసీఎస్‌లో ఎగుమతి కావాల్సిన ధాన్యం

అర్వపల్లి : యాసంగి సీజన్‌కుగాను ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి కావొస్తున్నప్పటికీ లారీల కొరతతో ధాన్యం బస్తాల ఎగుమతిలో తీవ్ర జాప్యం జరుగుతుంది. కాంటాలైన ధాన్యం రోజుల తరబడి కేంద్రాల్లోనే ఉండిపోతుంది. దీంతో రైతులు ధాన్యం అమ్ముకొని కూడా ఇక్కట్ల పాలవుతున్నారు. కొన్ని రోజులుగా లారీల కొరత ఏర్పడింది. దీంతో రైతులు కాంటాలైన ధాన్యం ఎగుమతి అయ్యే వరకు కేంద్రాల్లోనే నిరీక్షిస్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో 21ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 5.40 లక్షల బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో ఇంకా కేంద్రాల్లోనే 21,295 బస్తాల ధాన్యం వారం రోజుల నుంచి ఉంటుంది. కాంటాలైన ధాన్యం బస్తాలు ఎగుమతి కాకపోవడంతో మిగిలిన ధాన్యాన్ని కాంటాలు పెట్టడానికి నిర్వాహకులు ముందుకు రావడం లేదు. ఈ కాంటాలైన ధాన్యాన్ని వెంటనే ఎగుమతి చేసి కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నదాతలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

నాగారం : గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తన నివాసంలో ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగారం బంగ్లాకు చెందిన యూత్‌క్లబ్ సభ్యులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. క్రీడాకారులు క్రీడాసామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, బీఆర్ఎస్ నాయకులు గుంటకండ్ల ముకుందారెడ్డి, బయ్యం వెంకన్న, కన్నెబోయిన అంజయ్య, సతీష్, బెల్లి నరేష్, గుంటకండ్ల ప్రవీణ్‌రెడ్డి, భార్గవ్, శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి, శశి, శ్రీను, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రికెట్ కిట్లను బహూకరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

రాష్ట్ర కమిటీ సభ్యుడిగా జ్ఞానసుందర్

అర్వపల్లి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాల రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యుడిగా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జ్ఞానసుందర్ మాట్లాడారు. ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ కృషివల్లె ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాలను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తనను వేడుకల కమిటీ రాష్ట్ర సభ్యుడిగా నియమించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : మే 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని మండల తహసీల్దార్ సరిత కోరారు. బుధవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఈనెల 2వ తేదీన జెండాల ఆవిష్కరణతో ఉత్సవాలు ప్రారంభం, 3న రైతుల దినోత్సవం, 4, సురక్ష దినోత్సవం, 5న విద్యుత్ విజయోత్సవం, 6న పారిశ్రామిక పాడి ఉత్సవం, 7న తాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండుగ, 9న సంక్షేమ సంబరాలు, 10న సుపరిపాలన దినోత్సవం, 11న సాహిత్య దినోత్సవం, 12న తెలంగాణ రన్ దినోత్సవం, 13న మహిళా సంక్షేమ దినోత్సవం, 14న వైద్య ఆరోగ్య దినోత్సవం, 15న పల్లె ప్రగతి దినోత్సవం, 16న పట్టణ ప్రగతి దినోత్సవం, 17న గిరిజన దినోత్సవం, 18న మంచినీళ్ల పండుగ, 19న హరితోత్సవం, 20న విద్యా దినోత్సవం, 21న ఆధ్యాత్మిక దినోత్సవం, 22న అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కోరారు.

గ్రామ పంచాయతీలు ముస్తాబు

మఠంపల్లి : జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలను ముస్తాబు చేస్తున్నారు. బుధవారం ఎంపీడీఓ జానకిరాములు మండలంలోని పలు గ్రామపంచాయతీలను సందర్శించి మాట్లాడారు. పంచాయతీ కార్యాలయాలను మామిడి తోరణాలతో, విద్యుత్ వెలుగులతో అందంగా ముస్తాబు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ అధ్యక్షతన గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యదర్శులకు మండల పరిషత్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలపై అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీఓ ఆంజనేయులు, విజయ్‌కుమార్, మణి, రాంబాబు, తదితరులున్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు

కోదాడరూరల్ : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలోని కొమరబండలో గల సర్వే నెంబర్ 190లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ బుధవారం కోదాడ పట్టణంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములన్నింటిని అధికార పార్టీ నాయకులు కబ్జా చేస్తూ పేదలకు దక్కకుండా చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి నిరుపేదలకు ఇవ్వాలని లేనిపక్షంలో పార్టీ తరపున పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు కొమరబండలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు పేదలు యత్నించగా పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని పేదలు వేసిన గుడిసెలను తొలగించారు. కార్యక్రమంలో ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు మట్టపల్లి అంజన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పేర్ల నాగన్న, ఎర్ర అఖిల్‌కుమార్, రామోజీ, పుల్లూరి సంహాద్రి, గోపి, వీరబాబు, వెంకన్న తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, సర్పంచ్, గ్రామపెద్దలు

మఠంపల్లి : మండలంలోని వరదాపురంలో గ్రామ దేవతలు శ్రీపెద్దమ్మ, ముత్యాలమ్మ, అంకమ్మ, ఇంద్రపెల్లి ముత్యాలమ్మ, పోతురాజుల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు నాలుగు రోజులుగా వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా బుధవారం యాజ్ఞికులు రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, రాజశేఖరశర్మల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి ఉదయం 8:12 నిమిషములకు శుభముహూర్తమున కళాన్యాశం, ప్రాణప్రతిష్ఠ, మూలమంత్ర అధికార హోమములు చేపట్టారు. యంత్రబింబ స్థాపనలతో ప్రతిష్ఠాపనోత్సవాలు చేశారు. అనంతరం హోమం పూర్ణాహుతి గావించారు. కాగా అన్నదాన కార్యక్రమానికి ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చలకూరి బాబు, సర్పంచ్ బచ్చలకూరి అఖిలబాబు, ఉపసర్పంచ్ బత్తుల శంకరయ్య, వల్లపుదాసు దుర్గయ్యగౌడ్, విశ్వనాథుల శ్రీనివాస్, లింగయ్యగౌడ్, వార్డుసభ్యులు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పైపులైన్ల లీకేజీపై పట్టింపేదీ!



రామాపురంలో పైప్‌లైన్ లీకేజీతో వీధుల వెంట నిలిచిన నీరు



పైప్‌లైన్ లీకై వృథాగా పోతున్న నీరు

- వీధుల వెంట పారుతున్న నీరు
- తాగు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చిలుకూరు : మండలంలోని రామాపురం గ్రామంలో పైపులైన్ల లీకేజీతో తాగు నీటికి కటకట ఏర్పడింది. గత కొన్ని రోజులుగా పైపులైన్లు లీకై నీరు వీధుల వెంట పారుతోంది. పలు వీధుల్లో తాగునీటి నల్లాలు లీక్ కావడం, గేట్ వాల్స్ సక్రమంగా లేకపోవడంతో నల్లాల వద్ద నీరు వృథాగా పోతోంది. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో కొన్ని వీధుల్లోని ప్రజలకు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా నల్లాలు లీకైన ప్రదేశాలలో వీధులు బురదమయంగా మారి దోమలు స్వైర విహారం చేస్తుండడంతో పాట దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే గ్రామంలో పారిశుద్ధ్యం కూడా అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు గ్రామ పాలకవర్గానికి, అధికారులకు తెలియజేసిన వారు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి నల్లాల వద్ద లీకేజ్‌లు నివారించి, గేట్‌వాల్స్ ఏర్పాటు చేసి తాగు నీటి ఇబ్బందులు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నీటి సమస్య తీవ్రంగా ఉంది



మా గ్రామంలో పైప్‌లైన్ లీకేజ్‌లతో వీధులు బురదమయంగా మారాయి. నల్లాల వద్ద నీరు లీకవుతుండటంతో కొన్ని వీధుల్లో నీరు రావడం లేదు. దీంత తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఈ విషయాన్ని పాలకవర్గం, అధికారులకు పలుమార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదు. మండల, జిల్లా స్థాయి అధికారులు స్పందించి గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలి

– రాయాభారపు వెంకటేశ్వర్లు, రామాపురం

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు



పస్తాలలోని రైస్‌మిల్లు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కడియం రామచంద్రయ్య

నాగారం : ధాన్యం దిగుమతుల్లో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. మండల పరిధిలోని పస్తాల శివారులో ఉన్న రైస్ మిల్లులో మిల్లర్లు ధాన్యం దిగుమతుల్లో కొర్రీలు పెడుతుండటంతో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. లక్ష్మాపురంలోని ఐకేపీ నుంచి మూడు లారీల ధాన్యాన్ని రైస్‌మిల్లుకు తరలిస్తే.. మిల్లర్లు నాణ్యతలేదని దిగుమతి చేసుకునేందుకు నిరాకరించారని అన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. దీంతో అధికారులు వెంటనే స్పందించి ధాన్యాన్ని మరో మిల్లుకు తరలించేందుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని చెప్పినా, మిల్లర్లు మాత్రం దిగుమతి చేసుకోకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా తరుగు పేరుతో కోతలు విధిస్తూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం దిగుమతుల్లో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు దేశగాని నర్సయ్య, శాగంటి అంజయ్య, శాగంటి సత్తయ్య, గుగులోతు మోతిలాల్, శాగంటి శ్రీను, యాదగిరి, అంజయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

అర్వపల్లి : ఎంసీపీఐయూ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు ఈ నెల 4, 5, 6 తేదీల్లో నర్సంపేటలో జరుగుతాయని ఎంసీపీఐయూ డివిజన్ ఇన్‌చార్జ్ ఈదురు వీరపాపయ్య కోరారు. ఎంసీపీఐయూ ప్లీనరీ సమావేశాల సందర్భంగా ఈ నెల 4న నర్సంపేటలో భారీ బహిరంగసభ జరుగుతుందని, ఈ సభకు జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్, రాష్ట్ర నాయకులు హాజరవుతారని చెప్పారు. నాయకులు ఏశబోయిన సుధీర్, వేముల పెదనర్సయ్య, బుగ్గయ్య, వెంకటేష్, మల్లేష్ పాల్గొన్నారు.